


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

## -142-

(27 ' మార్చ్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"**రాను రాను ఊరగాయలు** జాడీల్లో పడటం కూడా గగనంగా వుంది. ఇదివరకు చేతుల్లో డబ్బులేక బాధ పడేవాళ్ళం. ఇప్పుడు వస్తువులు దొరక్క అవస్థగా వుంది. గాలివానవల్ల చెట్లు పడిపోయాయట. చింతకాయ అంటూ కనపడందే రోజూ మావారు తిరుగుతూనే వచ్చారు. ఎక్కడన్నా గుల్లకాయ దొరుకుతుందేమోనని. ఒక్కరోజూ దొరకలేదు. తీసుకెళ్ళిన డబ్బు ఖర్చుపెట్టుకోవడం ఇంటికి తిరిగి రావడం."

"ఈ సంవత్సరం చింతకాయ వొట్టిదేనే చిలకా - అని పైగా హాస్యమాడటం" అని మరో ఆవిడ అందుకుంది.

"అసలు చింతకాయ దొరికిందిటమ్మా. గుల్లదాకా పోతున్నావ్? అసలు చింతకాయ కళ్ళపడటం ఘనంగా వుంది. ఇదివరకటి రోజుల్లో బళ్ళు కట్టుకు వచ్చి వీధిమూలలో దింపి, ఇంటింటికీ వచ్చి బ్రతిమాలి పోతుండేవాళ్ళు. ఇక కావిళ్ళమాట చెప్పనే అక్కర్లేదు. ప్రతినిత్యం వీధుల్లో వూరేగేవి. ఇప్పుడెక్కడ కనపడుతున్నాయి కావిళ్ళు. బస్సెక్కి పెద్ద బజారు పోతే పది మళ్ళు కాదు పాతిక మళ్ళు కొనేవాళ్ళు. ఎక్కడి పాపం వచ్చిందమ్మ.

"మనుష్యులకు ఏణ్ణాళ్ళ శని పడుతుందంటారు. దేశానికి పట్టిన శని ఎన్నేళ్ళ శనో తెలియడంలేదు. బ్రతుకులు యిలా అయిపోతున్నాయేం ఖర్మమో. చింతకాయ కింత కరువా! ఇదేం అమెరికానుంచి వస్తుందా? అదేదో అంటారు - ఆస్ట్రేలియా నుంచి వస్తోందా? దీనిమీద అదేమిటో అంటారు - అదే విదేశ మారకమో ఏమిటో, అదేమన్నా వేస్తున్నారా? అధ్వానమా!

"పంట్రల్లో చింతచెట్టు పైకెక్కడం దులపడం భయమైతే, వాసాలతో కొట్టవచ్చు. దీనికేమన్నా ఆయుధాలు కావాలా! మిలటరీ సహాయం కావాలా? ఇంత కరువైతే ఎలాగంట? మన గోడు ఆలోచించేవారెవరంట. అసలే బయటికి ఏమీ చెప్పుకోలేక కుక్కుకు కుక్కుకు చస్తున్న సంసారాల్లో తొక్కుడు పచ్చళ్ళు కూడా కరువైతే ముద్ద మ్రింగే కషాయం ఏమిటండీ?" అని ఆవిడ చాలా నైరాశ్యం వెళ్ళబుచ్చింది.

"నిజమే పిన్నిగారూ చాలా ఇబ్బందిగా వుంది. మావారు ఈ సంవత్సరం చింతకాయ పచ్చడి పెట్టడం దుర్లభం. కావలిస్తే మీ పుట్టింటికి వ్రాసుకో. ఉగాదికి పోనీ ఈ సంవత్సరం రాము. ఊరగాయలు పెట్టి పంపించమని వ్రాయి. కొంత మనశ్శాంతిగా వుంటుంది మనకీ వాళ్ళకూ" అన్నారు.

"అంటే నేనన్నాను పిన్నిగారూ! వాళ్ళూ మనలాటివాళ్ళే. ఇంకా మనకే సభ్యులు తక్కువ. వాళ్ళింట్లో పదముగ్గురు మెంబర్లు, పైన వచ్చేపోయే వాళ్ళు. ఎన్ని జాడీల పచ్చళ్ళయితే సరిపోతాయి? ఇంకా మనకి పంపేదాకా ఎక్కడ

మిగులుతాయి? అని. అంటే ఆయనన్నారు పిన్నిగారూ అల్లుడున్నప్పుడు అవన్నీ ఆలోచించడానికి వీల్లేదు. ఎలాగో అలా అవస్థపడి కోరిక తీర్చవలసిందే కదా. పైగా ఉగాది కట్నాలు ఎప్పుడూ ఏదీ అడగని వాళ్ళంకదా. పైపెచ్చు బస్తీ కాపురం చేస్తున్న అల్లుణి నేనొక్కణ్ణే కదా.

ఇంకా దేవుడు మేలుచేస్తే నాతో ఆయన కేవైనా పనులుంటాయి కదా. దీర్ఘంగా ఆలోచిస్తే డిగ్రీవున్న అల్లుణ్ణి నేనొక్కణ్ణేకదా. ఇంతటివాడు చింతకాయ పచ్చడి పంపమంటే ఇంకా ఆలోచించడమా - అన్నారండీ" అని ఆవిడ గుక్క తిప్పకుండా అప్పగించింది.

అది విన్న తర్వాత రెండో ఆవిడ అంది. "ఆ కోతలన్నీ విని కొంపతీసి వుత్తరం వ్రాశావేమిటి? వాళ్ళు చాలా అవస్థపడతారు. అదేదో దేశంలో ఈ మధ్య తెల్లకాకులు ఎగురుతూంటే చూశారని పత్రికలో పడిందట. మా ప్రక్క భాగంలో ఆయన చదివి చెప్పాడు. అవి అయినా కనిపించాయిగాని అల్లుని మంచితనమనేది ఇంకా ఎక్కడా వున్నట్లు వార్త వినలా. తనకు దొరకనివన్నీ అత్తవారింటికి ఆర్డరిస్తూ కూర్చుంటాడేమిటి?

"వాళ్ళుమాత్రం ఏం చేస్తారు? కూతురు మొఖం చూసి, మొహమాటానికి గంతులు వెయ్యాలనుకుంటారు కానీ సాగవద్దూ. ఈ రోజుల్లో ప్రతివాడూ కాలికో ఇనపగుండు కట్టుకు తిరుగుతున్నాడు. అడుగు వెయ్యడమే కష్టంగా వుంటే ఆడండి, పాడండి, గంతులు వెయ్యండంటే ఎలా వేస్తారు?

వెడితే ఉగాదికే వెళ్ళమను. ఏ కొట్లోనో పద్దువేసి బట్టలు పెడతారు. ఊరగాయ లెక్కడ పెట్టి పంపిస్తారు? మొన్న ఒక ఫారెస్టు ఆఫీసరుగారే వచ్చి కాయ తెచ్చుకుని, చింతపండు వేసి తొక్కుకున్నారట."

"ఆయనేమిటి పిన్నిగారు నూటికి తొంభైమంది అంతే. వామనగాయ తొక్కి, చింతపండు పిసికి అవి వుండలు చేసి దాస్తున్నారు. ఎందుకనో తెలుసా పిన్నిగారూ ఆ పచ్చడి ఏడాది వుంటుందని నమ్మకమేమిటి? ఎప్పుడు బూజు పడుతుందో తెలియదు. అందుకని పిన్నిగారూ ఉండలు చేసి వుంచితే ఒకవేళ బూజు పడితే ఉండకు ఉండ తీసి దులుపుకోవడానికి వీలుగా వుంటుందిగా పిన్నిగారూ.

అదీకాకుండా కొంచెం బూజు రింగు రాగానే ఆ ఉండ తీసి దులిపి దాన్ని వాడి వేసుకోవచ్చుగా పిన్నిగారూ. జాడీలో వుంటే ఇంత వీలుగా వుండదుగా మరి. అందుకని ఈ పద్ధతి పెట్టారు. మీరు విన్నారా పిన్నిగారు అని ఆవిడగారు ఒక క్రొత్త పరిశోధన బయటపెట్టినట్లుగా చిరునవ్వు చిలకరించింది.

అది విన్న పిన్నిగారు "ఆ ఈ ఉపాయం ఒకటి కనిపెట్టారన్నమాట. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలని వూరికే అన్నారా? చింతకాయ ఉండాలా? మరి అంటుకుపోకుండా ఎలా వుంచుతున్నారో" అని పిన్నిగారి ప్రశ్న.

"ఈ రోజుల్లో అదేం సమస్య పిన్నిగారూ ప్లాస్టిక్ షీట్సు అమ్ముతున్నారుగా. ఒక రూపాయి పెట్టి కొని తెస్తే ఒక మాదిరి ఉండలు పాతికదాకా చుట్టొచ్చు పిన్నిగారూ. ఒకదానికి ఒకటి ఎలా అంటుకుంటాయి?"

"అంటుకోని మాట వాస్తవమే కానీ అనుకున్నదానికంటే బూజు మాత్రం కొంచెం దబ్బున పడతాయి. బాగా బిగబట్టి పడేస్తారాయె" అని పిన్నిగారు.

"లేదు పిన్నిగారూ వారానికోసారి వూడదీసి చూస్తారుగా. ఆ బాధేం వుండదు" అని జవాబు.

"ఏమిటో నమ్మ. వూరగాయలక్కూడా వింత వింత పద్ధతులొస్తున్నాయి. ఈ వింతలు ఇంకా ఎన్ని బయలుదేరతాయో"

"చూడాలి మరి అవసరాన్ని బట్టి ఉపాయాలన్నారుగా పెద్దలు పిన్నిగారూ. అలాగే వస్తున్నాయి పద్ధతులు. ఏం చేస్తారు చెప్పండి. మధ్య తరగతివాళ్ళు? ఇన్ని మారాం మనోళ్ళు వచ్చి పడుతున్నాయి" అన్నదామె.

"ఇంకో సోద్యం చెప్పనా నీకు. మా బంధువుల్లో ఒకాయన అదేదో వూళ్ళో ఉద్యోగం చేస్తున్నాడు. భార్య మరో వూళ్ళో ఉద్యోగం. ఆవిడ ఉత్తరం వ్రాసిందిట. నా ఉద్యోగం డబ్బుతో ఉసిరికాయనే పెట్టిస్తాను. మీ జీతంతో మీరు చింతకాయ పెట్టించండి. నేవచ్చినప్పుడల్లా ఇంత ఉసిరికాయ తెస్తాను. మీరిక్కడికి వచ్చినప్పుడు చిన్న జాడీ చింతకాయ తెస్తూవుండండి" అని

"ఇలా ఎన్నెన్ని విషయాల్లో పంపుళ్ళు పెట్టుకున్నారు. ఎలా సాగుతోందో దాంపత్యం. అప్పడాలు ఆయన వంతు, వడియాలు ఆవిడవంతూ నేమో" అని ఆవిడ పకపక నవ్వుకుంది.

"ఆ వంతుల్లో పంతంతో పనులు జరుగుతాయి ఏమంటారు పిన్నిగారూ" అంది రెండో ఆవిడ. అప్పటికి పిన్నిగారి నవ్వింకా ఆగలేదు.

Post your comments